సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 10 । ఫిబ్రవరి । 2024



అంజన్న బ్రహ్మోత్సవాలకు వేళాయె

కుంపిణీపురంలో వరాహ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఈనెల 16 నుంచి జరిగే ఉత్సవాల కోసం నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. -8లో



కట్టుకున్న భార్యే కడతేర్చింది

వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని కట్టుకున్న భర్తను.. ప్రియుడు, కన్నతండ్రితో కలిసి భార్య కిరాతకంగా కడతేర్చిన సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.210	రూ.280
రెండోరకం	రూ.110	రూ.200

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 80 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	475	475
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 153.920 కిలోలు

న్యూస్‌రీల్

వైభవంగా పల్లకీసేవ



పల్లకీలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడికి అమావాస్య పూజలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవారిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ మాఢవీధులు, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, కన్నడ భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థినికి గోల్డ్‌మెడల్



మెమెంటో అందుకుంటున్న పద్మతేజ

మదనపల్లె సిటీ: స్థానిక ఎస్‌బీఐ కాలనీకి చెందిన సుబ్రమణ్యం, నిర్మల కుమార్తె పద్మతేజ జనరల్ మెడిసిన్ ఎండీలో గోల్డ్‌మెడల్ సాధించింది. విజయవాడ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన 26వ స్నాతకోత్సంలో పద్మతేజకు వీసీ కె.బాబ్జి, నిమ్‌హాన్స్ డైరెక్టర్ ప్రతిమామూర్తి చేతుల మీదుగా గోల్డ్‌మెడల్, లక్ష్మినారాయణమూర్తి మెమోరియల్ అవార్డు అందజేశారు. 2020లో ఎండి (జనరల్ మెడిసిన్) పూర్తి చేసి 70.5 శాతం మార్కులు సాధించింది. పద్మతేజను పట్టణంలోని ప్రముఖులు, వైద్యులు అభినందించారు.

హార్సిలీహిల్స్‌పై మినీ స్టూడియో



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ హరిప్రసాద్

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై మినీ స్టూడియో, అమ్యూజింగ్ సెంటర్ నిర్మాణం కోసం స్థల కేటాయింపునకు శుక్రవారం మదనపల్లె ఆర్డీఓ హరిప్రసాద్ పరిశీలన జరిపారు. కొండపై ఇప్పటికే క్రీడాశాఖకు కేటాయించిన భూమిని పరిశీలించి, అందులో కొంత భూమిని కేటాయించడం కోసం తహసీల్దార్ పుణ్యవతి, ఆర్ఐ బాలాజీ, సర్వేయర్ శ్రీవాణీ, వీఆర్ఓ నరేంద్రలతో సమీక్షించి రికార్డులు పరిశీలించారు. అనంతరం బయ్యప్పగారిపల్లెలో భూ బదలాయింపు ప్రతిపాదనలను పరిశీలించారు.

రైతులు ఈకేవైసీ చేసుకోవాలి



రైతులకు సూచనలు ఇస్తున్న జేడీఏ చంద్రానాయక్

సంబేపల్లె: రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జేడీఏ చంద్రానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం సంబేపల్లె మండలంలో మండల స్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశం జిల్లా వ్యవసాయ సంచాలకులు, సలహా మండలి కమిటీ సభ్యుల సమక్షంలో జరిగింది. ఈసందర్భంగా జేడీఏ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాల గురించి వివరించారు. ఈక్రాప్, ఈకేవైసీ చేయించుకుంటే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని రైతులకు తెలియజేశారు. డీఏఓ ఆఫీస్ టెక్నికల్ వ్యవసాయ అధికారి వెంకట మోహన్, మండల వ్యవసాయ అధికారి డాక్టర్ కిషోర్ నాయక్, ఏఈఓడబ్ల్యు ఎం రెడ్డి వెంకటరమణ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం సావిత్రి దేవి


పెండ్లిమర్రి: వైఎస్సార్ జిల్లా గంగనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి పి.రెడ్డయ్య టెన్నికాయిట్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల హెచ్ఎం సావిత్రి దేవి, పీఈటీ శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఈపోటీలు ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు జరిగాయన్నారు. విద్యార్థికి ఉపాధ్యాయుల అభినందనలు తెలిపారు.

శ్రద్ధ చూపితే మార్కుల యోగమే

- ప్రాక్టికల్ పరీక్షలకు సర్వం సిద్ధం
- 11 నుంచి 20 వరకు జనరల్ విద్యార్థులకు..
- నాన్ జంబ్లింగ్ విధానంలో నిర్వహణ

జనరల్ కోర్సులు:
ఫిబ్రవరి 11నుంచి ఫిబ్రవరి 20 వరకు
వేళలు: ఉదయం 9 నుంచి 12 వరకు
మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు

మదనపల్లె సిటీ: ఇంటర్మీడియట్ విద్యార్థులకు అత్యంత కీలకం. ఇక్కడ సాధించే మార్కులు ఉన్నత చదువులకు ఎంతో ఉపయోగపడతాయి. ముఖ్యంగా సైన్స్ విద్యార్థులకు ప్రాక్టి కల్స్ మార్కులు ప్రాధాన్యమైనవి. ఆసక్తి చూపితే ప్రతి ప్రాక్టికల్‌లో 30 కి 30 సాధించవచ్చునని సబ్జెక్టు నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే ప్రయోగ పరీక్షల షెడ్యూలు ఖరారైంది .ఈ నేపథ్యంలో ప్రాక్టికల్స్‌లో ఎదురయ్యే ఇబ్బందులు, వాటి అధిగమించడంపై



నిపుణులు పలు సలహాలు ఇచ్చారు.

ప్రయోగ పరీక్షల షెడ్యూలు:
జనరల్ కోర్సులు చదివే విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు ప్రయోగ పరీక్షలు జరుగుతాయి. ఎంపీపీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు సంబంధించి సబ్జెక్టుకు 30 మార్కుల వంతున 60 మార్కులు, బైపీపీ విద్యార్థులకు నాలుగు సబ్జెక్టులో 30 మార్కుల వంతున 120 మార్కులు కేటాయిస్తారు.



ప్రయోగశాలలో విద్యార్థులు (ఫైల్)

ఈనెల 11 నుంచి 20 వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ,బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ ఏడాది నాన్ జంబ్లింగ్ విధానంలో ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఫలితం తప్పనిసరి



కెమిస్ట్రీ ప్రాక్టికల్స్‌కు మూడు గంటల సమయం ఇస్తారు. మూడు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో లవణ విశ్లేషణ ఉంటుంది. లవణ విశ్లేషణలో భౌతిక పరీక్షలు చేసిన తర్వాత రసాయన పరీక్షలు చేసి, ఆనయాన్, కాటయాన్‌లను గుర్తించడం, వాటి నిర్ధారణ పరీక్షలు ముఖ్యమైనవి. చివరగా ఫలితం తప్పనిసరిగా రాయాలి. ఫలితానికి ఒక మార్కు ఉంటుంది. మొత్తంగా ఈ విభాగానికి పది మార్కులుంటాయి. రెండో విభాగంలో ఘన పరిమాణాత్మక విశ్లేషణకు 8 మార్కులు. ప్రాక్టికల్ ప్రారంభమైన వెంటనే మొదటి పది నిమిషాల్లో ప్రయోగ విధానం రాయాలి.మూడో విభాగానికి ఆరు మార్కులు. వైవాకు, ప్రాజెక్టు రికార్డు, జనరల్ రికార్డుకు రెండేసి మార్కులు వంతున ఆరు మార్కులుంటాయి.

–టి.సహదేవి,కెమిస్ట్రీ అధ్యాపకురాలు,
మోడల్ జూనియర్ కాలేజీ, తంబళ్లపల్లె

మంచి మార్కులు సాధించవచ్చు



భౌతికశాస్త్రానికి మూడు గంటల సమయానికి 30 మార్కులు కేటాయిస్తారు. మొత్తం 20 ప్రయోగాల్లో ఆరు విభాగాల నుంచి 38 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి బ్యాచ్‌కు 12 ప్రశ్నల వంతున ఇస్తారు. ప్రయోగ సూత్రానికి రెండు మార్కులు, ప్రయోగ విధానానికి మూడు మార్కులు, పట్టికలు, పరిశీలనలు, గ్రాఫ్‌లకు ఎనిమిది, కాలిక్యులేషన్స్‌కు నాలుగు, జాగ్రత్తలకు రెండు, ఫలితం, ప్రమాణాలకు రెండు మార్కులు, రికార్డులకు నాలుగు, వైవాకు ఐదు మొత్తంగా 30 మార్కులుంటాయి. లాగర్థమ్స్ ఉపయోగిస్తూ కాలిక్యులేషన్స్ చేస్తే పూర్తి మార్కులు వస్తాయి. అన్ని ప్రయోగాలకు జాగ్రత్తలు తప్పనిసరిగా రాయాలి.

–జి.వెంకటరాముడు, ఫిజిక్స్ అధ్యాపకులు,
ప్రభుత్వ జూనియర్ కాలేజీ, తంబళ్లపల్లె

భాగాల గుర్తింపు ముఖ్యం



జంతుశాస్త్ర ప్రయోగ పరీక్షల్లో మూడు ప్రశ్నలుంటాయి. ఒకటో ప్రశ్నగా చార్ట్‌ను డిస్‌ప్లే చేస్తారు. టైటిల్ చెప్పి పటం గీసి భాగాలను గుర్తించాలి. వీటికి ఆరు మార్కులు. రెండు ప్రశ్నగా ఫిజియాలజీ ప్రయోగం ఇస్తారు. ఈ ప్రశ్నకు మూలసూత్రం, ప్రయోగవిధానం , ఫలితంగా తప్పనిసరిగా రాయాలి. సైడ్ హెడ్డింగ్స్ పెట్టి, సంబంధిత సమాచారం రాయాలి. వీటికి ఐదు మార్కులు. మూడో ప్రశ్నలో స్లైడులు, స్పెసిమెన్స్ కలిపి ఏడు రకాల స్పాటర్స్ ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు, నాలుగో ప్రశ్న రికార్డు. దానికి ఐదు మార్కులు. జువాలజీ ప్రాక్టికల్స్‌లో 30 మార్కులు తెచ్చుకోవడం సులువు. అయితే ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం చేయాలి. శరీరధర్మశాస్త్ర ప్రయోగాల్లో తప్పనిసరిగా మూల సూత్రం, ప్రయోగ విధానం, ఫలితం ఉండాలి.

– సాదిక్‌అలీ, జువాలజీ అధ్యాపకుడు,
మోడల్ కాలేజీ, తంబళ్లపల్లె

సూటిగా సమాధానాలు చెప్పాలి



వృక్షశాస్త్రం ప్రయోగ పరీక్షకు 30 మార్కుల ప్రశ్నపత్రంలో ఐదు విభాగాలు ఉంటాయి. ఒకటో ప్రశ్న వృక్ష వర్గీకరణ శాస్త్రంలో మూడు కుటుంబాల్లో ఒక కుటుంబం నుంచి వస్తుంది. వర్ణన క్రమపద్ధతిలో ప్రణాళికబద్ధంగా రాయాలి. ఇచ్చిన మొక్కను బట్టి పుష్పచిత్రం, సమీకరణం, కుటుంబ గుర్తింపు తప్పనిసరి. రెండో ప్రశ్న వృక్ష అంతర్నిర్మాణశాస్త్రం నుంచి వస్తుంది. ఇచ్చిన మెటీరియల్‌ను బట్టి స్లైడ్ తయారీని చాలా శ్రద్ధగా చేయాలి. మూడో ప్రశ్న వృక్ష శరీర ధర్మశాస్త్రం నుంచి వస్తుంది. లాటరీ పద్ధతిలో విద్యార్థికి వచ్చిన ప్రయోగానికి అనుగుణంగా పరికరాల అమరిక చేయాలి.

–అజాజ్ అహ్మద్, బాటనీ అధ్యాపకులు,
మోడల్ కాలేజీ,తంబళ్లపల్లె

వైవీయూ ఆచార్యుడికి ప్రాజెక్టు మంజూరు



ప్రాజెక్టు మంజూరు పత్రాన్ని మధుసూదన్‌రెడ్డికి అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర ఆచార్యులు, బొటానికల్ గార్డెన్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ఎ. మధుసూదన్‌రెడ్డికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు రూ.43.27 లక్షల ప్రాజెక్టును మంజూరు చేసింది. ఏపీ బయోడైవర్సిటీ బోర్డ్ మెంబర్ సెక్రటరీ రమేష్ కుమార్ సుమన్ నుంచి ఉత్తర్వులు విశ్వవిద్యాలయానికి అందాయి. రాష్ట్రంలోని రైతుల ప్రయోజనం కోసం గ్లోరియోసా సూపర్బా ఎల్. సాగు, వాణిజ్యంపై పైలట్ ప్రాజెక్ట్‌గా దీన్ని పేర్కొన్నారు. వైవీయూ ఆచార్యునికి ప్రాజెక్టు రావడం పట్ల వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథ్‌రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్ ఈశ్వర్ రెడ్డి, ఆర్ అండ్ డీ డైరెక్టర్ ఆచార్య చంద్ర ఓబులరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆచార్య మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గ్లోరియోసా సూపర్బా మొక్క ఆఫ్రికా, ఆగ్నేయాసియాలోని పలు ప్రాంతాలలో వ్యాధులను నయం చేయడానికి ఆయుర్వేద ఔషధ మూలికగా, కొల్చిసిన్ కంటెంట్ కోసం ఔషధ పరిశ్రమలచే విస్తృతంగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఆర్థరైటిస్, గౌట్, రుమాటిజం, వాపు, అల్సర్, రక్తస్రావం పైల్స్, చర్మ వ్యాధులు, కుష్టు వ్యాధి, నపుంసకత్వము, పాము కాట్లు మొదలైన వాటిని నయం చేయడానికి ఈ మొక్కను ఉపయోగిస్తారు. మొక్కలను పెంచడం దగ్గర నుంచి వాటిని సంరక్షణ పద్ధతులు, ఎక్కువ విత్తనాల ఉత్పత్తి, అధిక దిగుబడి తదితర అంశాలపై శాస్త్రీయ పరిశోధన చేస్తామన్నారు. రాష్ట్రంలోని రైతుల ప్రయోజనం కోసం గ్లోరియోసా సూపర్బా ఎల్. సాగు వాణిజ్యకరణపై పైలట్ ప్రాజెక్ట్‌ను మంజూరు చేయడం పట్ల బయోడైవర్సిటీ బోర్డుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

హార్సిలీహిల్స్‌పై చిరుతల అలజడి!

పర్యాటకుల్లో భయాందోళనలు

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ వేసవి విడది కేంద్రం హార్సిలీహిల్స్ అడవిలో చిరుతలు ఘాట్‌రోడ్డుపై పగలు, రాత్రి సంచరిస్తూ పర్యాటకులను తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్నాయి. బైక్‌పై కొండపైకి వెళ్లాలంటేనే వణికిపోతున్నారు. వీటి బారిన పడకుండా ఉండేందుకు ఘాట్‌రోడ్డును రాత్రివేళల్లో మూసివేయడం మంచిదని అటవీశాఖ చెబుతోంది.

కోవిడ్ నుంచి సంచారం

2020, 2022లో కనిపించిన చిరుతలు 2023లో కనిపించలేదు. దీంతో ఇవి అడవి నుంచి వెళ్లిపోయాయని ఊపిరిపీల్చుకున్న సందర్శకుల్లో మళ్లీ భయం మొదలైంది. వారం రోజులుగా ప్రతిరోజూ ఘాట్‌రోడ్డుపై చిరుతలు కనిపిస్తుండటంతో భయం.. భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. 2011 వన్యప్రాణుల లెక్కింపులో కొండపై ఒక ఆడ, ఒక మగ చిరుతలు, రెండు చిరుత పిల్లలుగా నిర్ధారించారు. అంతకు ముందు కాండ్లమడుగు బీటులో చిరుత పులి పాదాన్ని గుర్తించి దాని వయసు 8 ఏళ్లు ఉంటాయని అంచనాకు



దట్టమైన హార్సిలీహిల్స్ అటవీప్రాంతం

వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో ఆధారాలను సేకరించారు. 2020లో లాక్‌డౌన్ సమయంలో ఎన్నడూలేని విధంగా ఆహారం కోసం కొండపైకి ఒక చిరుత వచ్చి కుక్కలను చంపి తీసుకెళ్లింది. మదనపల్లెకు చెందిన సైమన్, అతని మిత్రులు కారులో కొండపైకి వస్తున్న సమయంలో రేణిమాను మలుపు దాటిన తర్వాత ఘాట్‌రోడ్డుకు అడ్డంగా వచ్చి పిట్టగోడ దిగి అడవిలోకి వెళ్లింది. ఇది మూడేళ్ల వయసు కలిగి ఉంటుందని చూసిన సందర్శకులు చెప్పారు. ఈనెల ఒకటిన టూరిజం సిబ్బందికి మూడు చిరుతలు రోడ్డు దాటుతూ కనిపించాయి. రెండురోజుల క్రితం చిరుత ఒక గొర్రెను చంపి తింది. శుక్రవారం రెవెన్యూ సిబ్బంది ఆర్డీఓ పర్యటన కోసం బైక్‌పై కొండపైకి వస్తుండగా మూడో మలుపు వద్ద చిరుతలు సంచరిస్తూ కనిపించాయి.

- హార్సిలీహిల్స్ అటవీప్రాంతం తూర్పున కురబలకోట మండలం తెట్టు, దక్షిణాన కర్ణాటకలోకి రాయల్పాడు, పడమర గట్లమీదపల్లె వరకు విస్తరించి ఉంది. హార్సిలీహిల్స్ అడవి రాయల్పాడు అడవితో కలిసి ఉంటుంది. అక్కడినుంచి కర్ణాటకలో అత్యధిక అటవీ ప్రాంతం ఉంది. సాధారణ చిరుతలు 100 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సంచరిస్తుంటాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ చిరుతలు సంచరిస్తూ ఉండొచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఘాట్‌రోడ్డు మూసివేత?

హార్సిలీహిల్స్ అడవిలో మూడు చిరుతల సంచారంపై అటవీశాఖ అప్రమత్తమైంది. రాత్రి 9 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఘాట్‌రోడ్డుపై రాకపోకలను నిషేధించాలని యోచిస్తున్నారు. రాత్రివేళ రాకపోకలపై ఆంక్షలు పెట్టడమే సరైన చర్యని, దీనివల్ల ప్రమాదాలను ముందుజాగ్రత్తతో అరికట్టే అవకాశం ఉంటుందని మదనపల్లె రేంజర్ మదన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం చెప్పారు. దీనిపై సమీక్షించి, అభ్యంతరాలను స్వీకరించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ఆల్‌బెండజోల్‌తో నులిపురుగుల నుంచి రక్షణ

డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

సిద్దవటం: ఆల్‌బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు తెలిపారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఇచ్చే ఆల్‌బెండజోల్ మాత్రలను నమిలి మింగేటట్లు చూడా లని తెలిపారు. ప్రతి సంవత్సరం జనవరి, ఫిబ్రవరి, ఆగష్టు,సెప్టెంబర్ నెలల్లో ఈ మాత్రలను ఇస్తున్నట్లు చెప్పారు. 1 సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వరకు అందరికీ మాత్రలు వేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, ఎంపీహెచ్‌ఓ ప్రసాద్, పి.కొత్తపల్లి పిహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రంగ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

జగనన్న ఆరోగ్య సురక్షకు వచ్చిన పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలను అందిచాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు తెలిపారు. సిద్దవటం లోని జిల్లా



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

పరిషత్ ఉన్నత పాఠశాల అవరణంలో శుక్రవారం జరిగిన రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యాక్రమాన్ని డీఎంహెచ్‌ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీని పరిశీలించారు. పేషెంట్ల సంఖ్య తుక్కువగా నమోదు కావడంతో వలంటీర్ల ద్వారా పేషెంట్ల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్, గ్రామ కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, వైద్యులు డాక్టర్ రంగలక్ష్మి, డాక్టర్ రెహమాన్, డాక్టర్ శైనీ షారోన్, ఆప్తాల్మిక్ అధికారి లక్ష్మీకర్ రెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జీడిపల్లె నుంచి చెర్లోపల్లెకు700 క్యూసెక్కులు



బి.కొత్తకోట వద్ద పుంగనూరు ఉపకాలువలో నిండుగా ప్రవహిస్తున్న కృష్ణా జలాలు

బి.కొత్తకోట: చిత్తూరుజిల్లాలోని కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలను తరలించే చర్యల్లో భాగంగా నీటి ప్రవాహం పెంచేందుకు జలనవరులశాఖ చర్యలు చేపట్టింది. కుప్పానికి నీళ్లు తరలించాలంటే సత్యసాయి జిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లె రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరగాలి. గత ఏడాది అక్టోబర్ 19 నుంచి కృష్ణా జలాలను ఇక్కడినుంచి అన్నమయ్య, చిత్తూరుజిల్లాల్లో ప్రవహించే పుంగనూరు ఉపకాలువకు విడుదల చేశారు. ఇప్పుడీ నీటి ప్రవాహం తగ్గడంతో సమీక్షించిన ఇంజినీర్ ఇన్ చీఫ్ నారాయణరెడ్డి అనంతపురం జిల్లాలోని జీడిపల్లె రిజర్వాయర్ నుంచి నీటి విడుదలకు చర్యలు తీసుకున్నారు. దీంతో సోమవారం నుంచి 700 క్యూసెక్కుల నీటిని చెర్లోపల్లె రిజర్వాయర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం అందుబాటు మేరకు 270 క్యూసెక్కులను కుప్పం కాలువ కోసం పుంగనూరు ఉపకాలువకు నీటిని విడుదల చేస్తున్నారు. కుప్పం ఉపకాలులో శుక్రవారం నాటికి 70.1 కిలోమీటర్ వద్దకు కృష్ణా జలాలు చేరాయి. చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి నీటి విడుదల సామర్థ్యం పెంచితే ప్రవాహం ఇంకా పెరగనుంది.

హైవే భూ సేకరణ పరిశీలన

ప్రొద్దుటూరు: రాయచోటి - చాగలమర్రి హైవే రోడ్డుకు సంబంధించిన భుసేకరణను జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణం జరగనున్న నంగనూరుపల్లె, కొత్తపల్లె, గోపవరం ప్రాంతాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏ ప్రాంతంలో భూములు ధరలు ఏవిధంగా ఉన్నాయని అడిగారు. రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన వారికి తిరిగి ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం గోపవరం గ్రామ సచివాలయం-1లో జరుగుతున్న జగనన్న కాలనీ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను తనిఖీ చేశారు. రోజుకు ఎన్ని పట్టాలు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. జేసీ వెంట తహసీల్దార్ విద్యాసాగర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల: ఎర్రగుంట్ల మండలం మీదుగా త్వరలో నిర్మిస్తున్న వేంపల్లి - చాగలమరి ఎక్స్‌ప్రెస్ నేషనల్



అధికారులతో మాట్లాడుతున్న జేసీ గణేష్ కుమార్

జాతీయ రహదారికి సంబంధించి భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ పరిశీలించారు. మండలంలో పెద్దనపాడు, వై కోడూరు, యర్రగుంట్ల, పోట్లదుర్తి, హనుమనుగుత్తి గ్రామాల్లో భూములను సర్వే చేశారు. దీనికి సంబంధించి ల్యాండ్ మ్యాప్‌ను జేసీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుంట్ల తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, సర్వేయర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంకురార్పణ



దేవుని కడపలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



పుట్టమన్ను తెస్తున్న అర్చకులు

కడప రాయుడు కప్పురపు రాయుడయ్యాడు. బ్రహ్మాండ నాయకుడు బ్రహ్మోత్సవ కళను సంతరించుకున్నాడు. పరిసరాలన్నింటికీ కొత్త పరిమళాలను సంతరించి పెట్టాడు. జిల్లాకే తలమానికంగా నిలిచే తిరుమల వాసుని ప్రతిరూపంగా కడప గడపను దివ్యంగా వెలిగిస్తూ అంతటా ఉత్సవ శోభను కల్పించాడు. నేటి నుంచి పది రోజులపాటు రోజుకో వాహనంపై సూర్యప్రభ తేజంతో వెలిగిపోనున్నాడు. ఆ మహా మంగళమూర్తి బ్రహ్మోత్సవాలు ఒళ్లంతా కళ్లు చేసుకుని చూసినా తనవి తీరదు.

వైభవంగా కడపరాయుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కడప కల్చరల్: దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయ అర్చకులు మయూరం కృష్ణమోహన్, తివిక్రమ్‌లతోపాటు మరికొందరు వేద పండితులు దీక్షా తిరుమంజనం కార్యక్రమాన్ని జరిపారు. తొలుత విశ్వక్సేనునికి పూజ చేసి పుణ్యాహవాచనం నిర్వహించారు. రక్షా కంకణధారణ అనంతరం పల్లకీలో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు టీటీడీ ఇన్స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. మృత్సంగ్రహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పుట్ట మట్టిని పల్లకీలో ఊరేగింపుగా ఆలయానికి చేర్చి అంకురార్పణ వేడుకగా జరిపారు.. ప్రత్యేక విద్వాంసుల నాదస్వర, మంగళ వాయిద్యాల విన్యాసాలు ఉత్సవాలకు భక్తులను ఆహ్వానించాయి. అంకురార్పణ కార్యక్రమాన్ని తిలకించేందుకు విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

నేడు ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాల్లోభాగంగా శనివారం ఉదయం 10.30 నుంచి 11.00 గంటల్లోపు తిరుచ్చి, ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారి సన్నిధిలో ఊంజల్‌సేవ జరుగుతుంది. ఇదే సమయంలో టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు స్వామిపై కీర్తనలు ఆలపించనున్నారు. రాత్రి 6.30 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామిని కొలువుదీర్చనున్నారు. తర్వాత స్వామి మహిమల గురించి కళాకారులు హరికథ ద్వారా వివరిస్తారు.

క్లుప్తంగా

సాహిత్య అవార్డుకు దరఖాస్తు చేసుకోండి

మదనపల్లె సిటీ : కుప్పం రెడ్డమ్మ సాహిత్య సొసైటీ ఆధ్వర్యంలో ఉత్తమ సాహిత్య అవార్డులకు అర్హులైన రచయితలు దరఖాస్తులు చేసుకోవాలని సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ కుప్పం రామలక్ష్మమ్మ, మదనపల్లెకు చెందిన ప్రముఖ రచయిత టీఎస్‌ఏ కృష్ణమూర్తి సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన రచయితల నుంచి 2023లో ప్రచురితమైన ఈ కింది గ్రంథాలను ఆహ్వానిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. పద్య కావ్యాలు, వచన కవితా సంపుటాలు, కథా సంపుటాలు (కథా సంకలనాలు కాదు), నవలలు వచ్చిన గ్రంథాలు పరిశీలించి.. పరిశీలకులచే ఎన్నికైన గ్రంథాలకు శ్రీరామనవమి రోజు చిత్తూరులో జరిగే సమావేశంలో బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన రచయితలు మాత్రమే 2023 జనవరి ఒకటి నుంచి 2023 డిసెంబర్ 31వతేదీలోపు ప్రచురితమైన గ్రంథాలను రెండు ప్రతుల చొప్పున ఈ కింది చిరునామాకు రిజిస్టర్ ప్రింటెడ్ బుక్స్ పోస్టులో గానీ ప్రొఫెషనల్ కొరియర్ ద్వారా పంపాలన్నారు. డాక్టర్ కె.రామలక్ష్మమ్మ, డాక్టర్ రామలక్ష్మి నర్సింగ్ హోమ్, 17-434 సుందరయ్య స్ట్రీట్, చిత్తూరు-517001, మొబైల్ నంబర్ 9000115980, ఫోన్ నంబర్ 08572-228885ను సంప్రదించాలని కోరారు.

నిధుల గోల్‌మాల్‌లో ఒకరి సస్పెన్షన్

నందలూరు (రాజంపేట) : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో నిధుల గోల్‌మాల్‌పై ఒకరిని సస్పెండ్ చేయగా, మరొకరికి షోకాజ్ నోటీస్ అందజేశారు. ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదు మేరకు నిర్వహించిన దర్యాప్తులో.. రూ.1.75 లక్షలు పంచాయతీ నిధుల స్వాహాలో బిల్ కలెక్టర్ పోలిచెర్ల నరసింహులను సస్పెండ్ చేశారు. సిబ్బందికి అధిక జీతాల పేరిట గోల్‌మాల్‌లో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ కాకమూరి నరసింహులుకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

వీధి కుక్కల స్వైరవిహారం



కుక్కల దాడిలో గాయపడి ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం వచ్చిన బాధితులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం వీధికుక్కలు స్వైరవిహారం చేశాయి. ఈ ఘటనల్లో పలువురికి గాయాలయ్యాయి. పట్టణంలోని శివానగర్, మార్తోమానగర్, శ్రీకృష్ణదేవరాయనగర్, పూలబావివీధి, భావనారాయణనగర్, సాయినగర్, తెలుగుగంగరోడ్డు, గాంధీనగర్, కొండారెడ్డివీధిలలో వీధికుక్కలు ప్రజలపై దాడులు చేయడంతో సుమారు 20 మందికి పైగా ప్రజలు గాయపడ్డారు. వీరంతా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ఎం.క్రిష్ణ మున్సిపల్ సిబ్బందిని పురమాయించి ఆయా వీధుల్లో ప్రజలపై దాడులు చేసిన కుక్కలను పట్టించి ఊరి బయట వదిలిపెట్టారు.

అంజన్న బ్రహ్మోత్సవాలకు వేళాయె..!

- రాతి ఆవకాయజాడీలో స్వామి ఆవిర్భావం
- 216 ఏళ్ల కిందట ఆలయ నిర్మాణం
- కుంపిణీపురంలో 16 నుంచి బ్రహ్మోత్సవాలు
- ఇతర రాష్ట్రాల నుంచి తరలిరానున్న జాగీర్‌దారులు

నందలూరు(రాజంపేట) : కుంపిణీపురంలో వరాహ అంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఉత్సవాల కోసం నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో స్వామి వారి చరిత్రపై అందిస్తున్న ప్రత్యేక కథనం. రెండు శతాబ్దాల కిందట యేళ్ల కిందట మంత్రాలయానికి చెందిన అప్పాచార్యులు స్వప్నంలో ఆంజనేయస్వామి సాక్షాత్కారమై.. తాను పలానచోట రాతి జాడిలో ఉద్భవించానని చెప్పినట్లు.. ఆయన అక్కడి నుంచి అన్వేషించుకుంటూ కుంపిణీపురం(నందలూరు)లో జాగీర్దారులు నివసిస్తున్న ప్రాంతానికి చేరుకున్నారట. అప్పట్లో రాతి జాడీలను తయారు చేసుకొని అందులో ఆవకాయను నిల్వచేసుకునే వారు. ఆ విధంగా లీలావాణికి చెందిన ఇంటిలో ఉన్న రాతిజాడీలో అంజనేయస్వామి ఉద్భవించినట్లుగా గుర్తించారు. అనంతరం ఆయన స్వామివారిని ప్రతిష్టించారు. ఆలయ నిర్మాణం చేపట్టారు. మళ్లీ ఇక్కడి నుంచి మంత్రాలయం వెళ్లి అక్కడే సజీవసమాధి అయ్యారు. దక్షిణముఖంగా స్వయంభుగా వెలసిన అంజనేయుడు ఇక్కడ ఉండటం ప్రత్యేక విశేషం.





కుంపిణీపురంలోని వరాహ ఆంజనేయస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ప్రతిమ

మూడు రోజుల పాటు ఉత్సవాలు

16 నుంచి కుంపిణీపురం తిరునాల జరుగనున్నది. మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. 18న రథోత్సవం ఉంటుంది. వరాహ ఆంజనేయస్వామి (కుంపిణీపురం) దేవస్థానం వార్షిక ఉత్సవాలు మాఘశుద్ధ సప్తమి నుంచి మాఘపౌర్ణమి వరకు జరగనున్నాయి. మొదటి రోజు పుణ్యాహవచనం, వాస్తుహోమం, భాగవతప్రవచనం, ఆస్థాపూజలు ఉంటాయి. 11 గంటలకు స్వామివారి ఊరేగింపు, మధ్యాహ్నం 1 గంటకు తీర్థ ప్రసాదాలు, రాత్రి గరుడ సేవ, గ్రామాలలో ఊరేగింపు నిర్వహిస్తారు. రెండవరోజు భీష్మాష్టమి సందర్భంగా సాయంత్రం స్వామి వారి మోహిని ఉత్సవం, రాత్రి గజవాహనసేవ, ఊరేగింపు ఉంటాయి. మూడో రోజున ఉదయం మధ్యనవమి సందర్భంగా అభిషేకాలు, స్వామి వారి రథోత్సవం, వసంతోత్సవాలు, మహామంగళహారతి, నైవేద్యం, తీర్థప్రసాదాలు నిర్వహిస్తారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా..



దేశంలో ఎక్కడా లేని విధంగా స్వయంభు దక్షిణముఖ ఆంజనేయ స్వామి ఆలయం కుంపిణీపురంలో ఉంది. రాతి ఆవకాయజాడీలో స్వామి వారు ఉద్భవించడం విశేషం. దక్షిణముఖంగా ఆలయాలు ఉంటాయి. కానీ స్వయంభుగా వెలసిన స్వామి వారు లేరు. ప్రతి యేడాది రథసప్తమి రోజున వరాహ ఆంజనేయస్వామి, కుంపిణీపురం ఆంజనేయస్వామిని భక్తులు కొలుస్తుంటారు.

– సహాపురం రఘునాథాచార్యులు, ఆలయ అర్చకులు

ఆధ్యాత్మిక సందడి

కుంపిణీపురం వరహ ఆంజనేయస్వామి ఉత్సవాలకు వివిధ రాష్ట్రాలలో ఉన్న జాగీరుదారులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. మన రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణాలో స్థిరపడిన జాగీరుదారుల కుటుంబాల వారు వస్తారు. తరతరాలుగా పూజిస్తూ వస్తున్న వారందరూ కుటుంబ సమేతంగా తరలివస్తారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

సౌమ్యనాథుని దర్శనం.. పూర్వజన్మ సుకృతం

టీటీడీ చైర్మన్ తనయుడు భూమన

నందలూరు(రాజంపేట) : దక్షిణ భారతదేశంలో అతిపెద్ద వైష్ణవ ఆలయం అయిన నందలూరు సౌమ్యనాథస్వామి క్షేత్ర దర్శన భాగ్యం తన పూర్వజన్మ సుకృతమని తిరుపతి తిరుమల దేవస్థానం చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తనయుడు తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డి అన్నారు. నందలూరు గ్రామంలో వెలసివున్న సౌమ్యనాథాలయాన్ని ఆయన శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చోళుల కళానైపుణ్యానికి నిదర్శనంగా సౌమ్యనాథాలయం నిలుస్తోందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సౌమ్యనాథాలయం దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. అంతకుముందుగా టీటీడీ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్ ఆధ్వర్యంలో ఆయనకు పూర్ణకుంభస్వాగతం పలికారు. స్వామి వారి అభిషేక కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి రెండు ఇత్తడి దీపాలు బహూకరించారు. ఆలయ మర్యాదలతో అభినయ్ రెడ్డిని ఆలయ అర్చకులు సునీల్ శాలువా కప్పి సత్కరించారు. ఈయన వెంట భూమన సోదరుడు భూమన నిహార్‌రెడ్డి, సౌమ్యనాథాలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, బీసీ గురుకుల కళాశాల కమిటీ వైస్ చైర్మన్ వనం కనకరాజు, ఈదరపల్లె గ్రామస్తులు మోడపోతుల శ్రీనివాసులు, జడ నాగభూషణం, మోడపోతుల సుబ్రమణ్యం, వనం రామకృష్ణ, ఎం.గంగాధర్, రామకృష్ణ, బోనాషి వెంకటకిషోర్, వెంకట్ తదితరులు ఉన్నారు. అనంతరం ఉల్లంఘేశ్వరాలయంను దర్శించుకున్నారు. సౌమ్యనాథాలయంలోని పలువురు సిబ్బంది తమ సమస్యలను అభినయ్‌కు విన్నవించారు. చైర్మన్ దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు.



సౌమ్యనాథస్వామి ఆలయంలో భూమన అభినయ్‌రెడ్డి

అల్లర్లు సృష్టించి, కేసులు పెట్టించేది టీడీపీనే

- 2015 బక్రీద్ సంఘటన కేసును కొట్టేసిన న్యాయస్థానం
- ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి : అరాచకాలు, అల్లర్లు సృష్టించి కేసులు పెట్టించేది టీడీపీనేనని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శాంతికి, మత సామరస్యానికి ప్రతీక అన్నారు. భద్రత ఇచ్చి భరోసా కల్పించి ప్రజలకు మేలు చేసేది వైఎస్సార్‌సీపీనేనని స్పష్టం చేశారు. శుక్రవారం రాయచోటిలో ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన ఎన్నో అరాచకాలను చూశామన్నారు. 2015లో బక్రీద్ సందర్భంగా రాయచోటి పట్టణంలో అప్పటి ప్రభుత్వం విపరీతంగా అరాచకాలు సృష్టించి 53 మంది అమాయకులపై కేసులు నమోదు చేసి, వారి భవిష్యత్తుకు ఆటంకం కల్గించిందన్నారు. వారు పాస్‌పోర్టు పొందడానికి, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టుటకు ఆటంకం ఏర్పడిందన్నారు. హత్యాయత్నం తదితర భయానక సెక్షన్ల కింద ఇరికించారన్నారు. ఆ సమయంలో తాను ప్రతిపక్షంలో ఉన్నానని, వీరికి మద్దతుగా అప్పటి డీజీపీని కలిసి అమాయకులపైన ఎటువంటి కేసులు, చర్యలు చేపట్టవద్దని ఒత్తిడి చేసిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ సంఘటనలో అమాయకులైన యువకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయాన్ని ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. జరిగిన సంఘటనపై ప్రభుత్వం పోలీసుల ద్వారా నివేదికను తెప్పించుకొని కేసులు తొలగించేందుకు రెండు జీఓలు ఇచ్చిందన్నారు. ఇది చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు సదరు జీఓలపై కోర్టులో వేసి ఆటంకం కల్గించారన్నారు. అనేక మార్లు వాస్తవ విషయాలను కోర్టుకు తీసుకెళ్లిన నేపథ్యంలో.. ప్రభుత్వం ఇచ్చిన జీఓలను సమర్థించి, ఆమోదించి ఈ కేసులను పూర్తిగా కొట్టివేసిందన్నారు. కోర్టు నిర్ణయంతో ఇంత మంది యువకులకు న్యాయం, మేలు జరగడంపై సంతోషంగా ఉందన్నారు. కేసులోని నిందితులకు వారి భవిష్యత్తు దృష్ట్యా సమయం వృథా కానీయకుండా, రూపాయి ఖర్చు లేకుండా బాధ్యతగా పని చేస్తామన్నారు. కొంతమంది రాజకీయంగా ఎదుర్కోలేక, మంచి పనులు చేయలేక, పసలేని విమర్శలు చేస్తున్న వాటిని తాను పట్టించుకోనన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి



మృతి చెందిన టి.సుబ్బరాయుడు

రామాపురం : మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ మేదరపల్లి- నీలకంఠ్రావుపేట ప్రధాన రహదారిలోని పూలతోట వంక సమీపంలో శుక్రవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ వి.ఎల్.ప్రసాద్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కల్పనాయినిచెరువు గ్రామానికి చెందిన వీఆర్‌ఏ సుబ్బరాయుడు(70) ఇంటి నుంచి స్కూటీలో మేదరపల్లికి వెళ్తుండగా.. మార్గంమధ్యలో మేదరపల్లి నుంచి నీలకంఠ్రావుపేటకు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వీఆర్‌ఏ టి.సుబ్బరాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ద్విచక్ర వాహనంలో వస్తున్న సత్యనారాయణ, ఆయన భార్య వాణి, కుమారుడు శ్రీనివాసులకు తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను 108లో కడప రిమ్స్‌కు తరలించారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోండి



డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న దళిత, ప్రజా సంఘాల నేతలు

రాయచోటి అర్బన్ : దళిత మహిళల భూములకు సంబంధించి తప్పుడు నివేదికలు ఇవ్వడంతోపాటు వారిపై దాడి, హత్యాయత్నం జరగడానికి కారణమైన రామాపురం మండల తహసీల్దార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు డీఆర్‌ఓ సత్యనారాయణకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామాపురం మండలం చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లె సమీపంలో సర్వే నంబరు 1120 //1లో 9.29 సెంట్ల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఆ భూమిని అదే గ్రామానికి చెందిన సుధామణి, చిన్నరాములమ్మలు సాగుకు యోగ్యంగా తయారు చేసుకుని పంటలు పెట్టుకుంటున్నారన్నారు. తమ సాగులో ఉన్న భూమిని తమకు పట్టాగా ఇవ్వాలని గత కొన్నేళ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారన్నారు. కాగా సదరు స్థలంపై కన్నేసిన అదే గ్రామానికి చెందిన పడిగెల చిన్న నరసింహులు పలుమార్లు దళిత మహిళలపై దౌర్జన్యానికి దిగడంతో అతనిపై పోలీసులు నమోదు చేశారన్నారు. కాగా ప్రస్తుత తహసీల్దార్ ఫిబ్రవరి 3న భూములను పరిశీలించాలంటూ దళిత మహిళలను పొలం వద్దకు రప్పించడంతో.. వారిపై చిన్ననరసింహులు వర్గీయులు దాడి చేసి హత్యాయత్నం చేశారన్నారు. కాగా సదరు భూమి ఎవరి సాగులో లేదని తహసీల్దార్ ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు ఇచ్చినట్లు ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ, దళిత సంఘాల నేతలు పి.యల్.నరసింహులు, విశ్వనాథ నాయక్, యుగంధర్, పుల్లయ్య, సుధాకర్, పండరయ్య, పెద్దగంగయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆచూకీ లభ్యం

మదనపల్లె : అదృశ్యమైన తల్లీబిడ్డల ఆచూకీ లభ్యమైనట్లు శుక్రవారం తాలూకా సీఐ ఎస్. శేఖర్ తెలిపారు. మండలంలోని కొత్తపల్లి పంచాయతీ సందిరెడ్డిగారిపల్లెకు చెందిన లక్ష్మీపతి భార్య మమత(30), ఆమె కుమార్తె వర్షిత (2) జనవరి 28వ తేదీన ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయారు. ఆమె భర్త, కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో జనవరి 31వ తేదీన లక్ష్మీపతి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శేఖర్ ఆదేశాలతో హెడ్ కానిస్టేబుల్ రామ్మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అదృశ్యమైన మహిళ బిడ్డతో సహా కలకడ మండలం రాతికుంటపల్లె గ్రామంలో ఉంటున్నట్లు తెలుసుకుని వారిని అక్కడ నుంచి తాలూకా పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు వారిని అప్పగించారు.

కట్టుకున్న భార్యే కడతేర్చింది..!

- వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని....
- ప్రియుడు, తండ్రితో కలిసి భర్తను చంపిన వైనం
- 13 రోజుల తర్వాత కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యం
- మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చిన పోలీసులు
- ముగ్గురి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కేశప్ప, సీఐలు

మదనపల్లె : వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని కట్టుకున్న భర్తను.. ప్రియుడు, కన్న తండ్రితో కలిసి భార్య కిరాతకంగా కడతేర్చిన సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. మదనపల్లె మండలం చీకలబైలు పంచాయతీ దొనబైలు అటవీప్రాంతం గుర్రోళ్లగుట్టలో పూడ్చిపెట్టిన మృతదేహం వెలికితీతతో హత్య గుట్టు రట్టయింది. చిత్తూరు జిల్లా కల్లూరుకు చెందిన శ్రీనివాసులు(34)కు చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోవడంతో గుర్రంకొండ మండలం తరిగొండకు చెందిన మేనమామ వెంకటరమణ వద్ద పెరిగాడు. తర్వాత జీవనోపాధిలో భాగంగా మదనపల్లెకు వచ్చి చేనేత కారిమ్రకుడిగా స్థిరపడ్డాడు. ఈ క్రమంలో మదనపల్లె మండలంలో దిగువదొనబైలుకు చెందిన గీతను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు మగపిల్లలు. కొన్నేళ్లక్రితం మదనపల్లె మండలం జమ్ముకుంటపల్లె వద్ద ఇంటిని కొనుగోలు చేశాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో కొంత కాలం వేరుగా ఉంటున్నారు. గీత తన పుట్టినిల్లు దిగువ దొనబైలు వద్ద ఉంటుండగా, శ్రీనివాసులు మదనపల్లెలో నివాసం ఉన్నాడు. జనవరి 26న పిల్లలను చూసి వస్తానని వెళ్లిన శ్రీనివాసులు తర్వాత కనిపించకుండా పోయాడు. మరుసటి రోజు కర్ణాటక సరిహద్దు రాయల్పాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ చెరువులో శ్రీనివాసులు మోటార్‌సైకిల్ లభ్యమైంది. వాహనం రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా కర్ణాటక పోలీసులు ఫోన్ చేయగా, వారు మృతుడి మేనమామ వెంకటరమణ ఫోన్ నంబర్ పోలీసులకు ఇచ్చారు. దీంతో వెంకటరమణ రాయల్పాడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విచారణ చేయగా, మోటార్‌సైకిల్ తన మేనల్లుడిదేనని నిర్ధారించి, ఆచూకీ కోసం గాలించారు. ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో కర్ణాటక పోలీసుల సూచన మేరకు జనవరి 28న మదనపల్లె తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే రోజు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగించిన పోలీసులు శ్రీనివాసులు పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో నివాసం ఉన్నట్లు తేలడంతో టూటౌన్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

బండతో మోది హత్య చేసి..

టూటౌన్ పోలీసుల విచారణలో... చీకలబైలు పంచాయతీ ఎగువదొనబైలుకు చెందిన హరికృష్ణ కుమారుడు ముదిమడుగు ప్రసాద్(25)కు, మృతుడు శ్రీనివాసులు భార్య మండెంగీతమ్మ(33)కు వివాహేతర సంబంధం ఉన్నట్లు తేలింది. దీంతో పోలీసులు ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయగా హత్యకు దారితీసిన పరిస్థితులను వివరించాడు. జనవరి 26న శ్రీనివాసులు తన ఇద్దరు పిల్లలను చూసేందుకు చీకలబైలు పంచాయతీ జమ్మికుంటకు వచ్చి, భార్యతో గొడవపడ్డాడన్నారు. అనంతరం మద్యం తాగి, ఇంట్లో పడుకుని ఉండగా, గీత తనకు ఫోన్ చేసి తన తండ్రి పొగాకు రామస్వామిని తీసుకుని, ఇంటికి రావాల్సిందిగా చెప్పిందన్నాడు. తమ సంబంధం సజావుగా సాగాలంటే, భర్త శ్రీనివాసులు అడ్డు తొలగించుకోవాల్సి ఉంటుందని చెప్పింది. దీంతో ప్రసాద్, గీత తండ్రి రామస్వామి ఇద్దరూ కలిసి మద్యం మత్తులో పడుకున్న శ్రీనివాసులు తలపై బండరాయితో మోది హత్య చేశారు.

అటవీ ప్రాంతంలో పూడ్చివేత

అనంతరం శవాన్ని దొనబైలు గ్రామసమీపంలోని అటవీప్రాంతం గుర్రోళ్లగుట్టకు తీసుకెళ్లి ఎవ్వరికీ అనుమానం రాకుండా పూడ్చివేశారు. శ్రీనివాసులు ద్విచక్రవాహనాన్ని కర్ణాటక రాయల్పాడు సమీపంలోని చెరువులో పడేశారు. విచారణలో నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు తాలూకా సీఐ శేఖర్, టూటౌన్ ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, తాలూకా ఎస్‌ఐ రవికుమార్ గురువారం సాయంత్రం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అప్పటికే చీకటి పడటంతో వెనుదిరిగి, శుక్రవారం ఉదయం సీఐలు వలీబాషు, కృష్ణయ్య, శేఖర్, యువరాజ్‌లు నిందితులతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికితీశారు. హత్యజరిగి 13 రోజులు కావడం, మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండటంతో అక్కడే శవపంచనామా నిర్వహించారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 3 సెల్‌ఫోన్స్, ఒక మోటార్‌సైకిల్, హత్యకు ఉపయోగించిన బండరాయి, పార స్వాధీనం చేసుకున్నారు. అదృశ్యం కేసును హత్య కేసుగా మార్చుచేసి విచారణ కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఇనాయతుల్లా, హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు. కాగా, హత్యకేసులో గీత తల్లి, తమ్ముడిని అరెస్ట్ చేయాలని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షులు పొదల నరసింహులు స్థానికులతో కలిసి చీకలబైలు రహదారిపై నిరసన వ్యక్తం చేశారు.



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

సొంతిల్లు కట్టుకున్నాం



మేము టీడీపీలో ఉన్నప్పటికీ.. ఆ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన గత ప్రభుత్వంలో ఇల్లు మంజూరు కాలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత స్థలంతోపాటు ఇల్లు మంజూరైంది. మా కష్టం కూడా తోడు చేసి సొంతిల్లు కట్టుకున్నాం. హాయిగా జీవిస్తున్నాం. చాలా ఆనందంగా ఉంది. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– నడివీధి శశికళ, ఎస్సీ కాలనీ, వంతాటిపల్లి, సిద్దవటం మండలం

ఇంటి వద్దకే పథకాలు



వ్యవసాయమే ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్నాం. మా లాంటి వారికి జగనన్న ప్రభుత్వంలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయి. అర్హతే ప్రామాణికంగా వలంటీర్లు సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు మంజూరు చేస్తున్నారు. నా పేరిట ప్రతి ఏటా రైతు భరోసా ద్వారా రూ.12,500లతోపాటు నా కుమారుడు నవీన్‌కు అమ్మ ఒడి, నా భార్య వలస సునీత పేరిట జగనన్న పక్కా గృహం, ఆసరా సొమ్ము ఇలా అన్ని పథకాలు మంజూరయ్యాయి. కావున జగనన్న ప్రభుత్వమే మళ్లీ రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.

– వలస బాలాజీ, కందుకూరు, పెద్దతిప్పసముద్రం మండలం, అన్నమయ్య జిల్లా

ఆర్‌పీఎఫ్ అదుపులో బాలికలు

డోన్ రూరల్ : డోన్ రైల్వేస్టేషన్‌లో ఇద్దరు బాలికలను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం తెలిపారు. ఆమె వివరాల మేరకు.. అన్నమ్మయ్య జిల్లా పుల్లంపేట గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు మధురై నుంచి ఓఖా ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తుండగా గుత్తి వద్ద తిరుమల్ రెడ్డి అనే రైల్వే ఉద్యోగి ఆ ఇద్దరు బాలికలను చూసి అనుమానంతో డోన్ ఆర్‌పీఎఫ్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రైలు డోన్ స్టేషన్‌కు వచ్చిన వెంటనే బాలికలను అదుపులోకి తీసుకుని విచారించగా పుల్లంపేట గ్రామంలోని ఏపీ మోడల్ పాఠశాలలో 9,10వ తరగతి చదువుతున్నట్లు గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు మొహంపై మత్తు స్ప్రే చేసినట్లు బాలికలు తెలిపారన్నారు. కాగా బాలికల వద్ద కడప నుంచి కాచిగూడ వరకు రైలు టికెట్ ఉందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. తల్లిదండ్రులకు సమాచారం అందించామన్నారు. రైల్వే పోలీసుల ఆదుపులో ఉన్నట్లు తెలిపారు.

రైలులో బంగారు నగలు స్వాధీనం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కోయంబత్తూరు నుంచి బంగారు నగలను తీసుకు వెళుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని, 2 కిలోల 350 గ్రాముల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని కడప రైల్వే సీఐ నాగార్జున తెలిపారు. శుక్రవారం కడప రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గుంతకల్లు రైల్వే ఎస్పీ చాడేశ్వరి ఆదేశాల మేరకు తిరుపతి రైల్వే డీఎస్పీ షేక్ షా ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా కోయంబత్తూరు నుంచి బంగారు నగలను తీసుకొస్తున్న ఇరువురు కడపలో అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి విచారించగా బంగారు ఆభరణాలు లభ్యమయ్యాయని తెలిపారు. వాటిని ఇన్‌కం ట్యాక్స్ అధికారులకు అప్పగించామన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన తనతోపాటు ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఆర్‌ఎస్‌ఐ విజయ నరసింహులు, రవిచంద్ర, సిబ్బంది ఫిరోజ్, సుబ్బయ్యలను రైల్వే ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారన్నారు. రైల్వే ప్రయాణికులు ప్రయాణ సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే ప్రయాణ సమయంలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు, రైల్వే పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా డీసీసీ బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవం

కడప అగ్రికల్చర్ : కడప డీసీసీ బ్యాంకు ఏర్పాటై 106 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం కడప డీసీసీ బ్యాంకులో 106వ అవిర్భావ దినత్సోవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్‌లతోపాటు బ్యాంకు సిబ్బంది కలిసి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చైరపర్సన్ మల్లెల ఝాన్సీరాణి మాట్లాడుతూ 1919లో కడప జిల్లా రైతుల ప్రయోజనాల కోసం సహకారం రంగంలో ఏర్పడిన తొలి బ్యాంకు మన కడప డీసీసీ బ్యాంకు అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.